

ఒకే ప్రశ్న పత్రంతో..

నేటి నుంచి ఇంటర్ అర్ధ వార్షిక పరీక్షలు మొదలుకానున్నాయి. అన్ని యాజమాన్యాలకూ ఒకే పేపర్ రానుంది. - 8లో



అతివేగం ఆయువు తీసింది

జిల్లా కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. అతి వేగమే కారణమని తెలుస్తోంది. - 8లో

నేడు గరిమెళ్ల పేరిట తపాలా ముద్రిక విడుదల

పోలాకి(నరసన్నపేట): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, జాతీయ కవి గరిమెళ్ల సత్యనారాయణ పేరిట ఆజాదీ అమృత్ మహోత్సవంలో భాగంగా ప్రత్యేక తపాలా ముద్రికను ఆయన వర్ధంతి సందర్భంగా సోమవారం విడుదల చేయనున్నట్లు గరిమెళ్ల మెమోరియల్ ట్రస్టు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేపీఎస్ భుక్త, బాదాన రాజులు తెలిపారు. భారత ప్రభుత్వం సౌజన్యంతో గరిమెళ్ల ట్రస్టు, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా ప్రియాగ్రహారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు భుక్త తెలిపారు.

ఆనందమనిపింఛెను

- జనవరి నుంచి పింఛన్ రూ. 3000
- పెరగనున్న వైఎస్సార్ పింఛన్ కానుక
- ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటున్న సీఎం వైఎస్ జగన్
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

నరసన్నపేట, శ్రీకాకుళం పాత బస్టాండ్: 'అన్న'మాట ప్రకారం పింఛన్ కానుక పెరుగుతోంది. అంచెలంచెలుగా పింఛన్ కానుక పెంచుకుంటూ వెళ్తామని చెప్పిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ జనవరి నుంచి పింఛన్‌ను రూ.3000లకు పెంచనున్నారు. వృద్ధులు, వితంతువులు, మత్స్యకారులు, చేనేత కార్మికులు, ఒంటరి మహిళలకు ప్రస్తుతం రూ.2750 ఇస్తున్నారు. జనవరి నుంచి మరో రూ.250 పెంచుతూ రూ. 3000 ఇవ్వనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిర్ణయం తీసుకోవడంతో పాటు శుక్రవారం జరిగిన కేబినేట్ సమావేశంలో మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో అవ్వాతాతలు ముందుగానే నూతన సంవత్సరం వచ్చినంత సంబర పడుతున్నారు. గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పింఛన్‌ను రూ.3000 వరకు పెంచుతామని వైఎస్ జగన్ ప్రకటించారు. ఏటా రూ.250 చొప్పున పెంచుతూ పింఛన్ కానుకను జనవరికి రూ.3వేలుకు తీసుకువచ్చారు. ఈ మొత్తాన్ని వలంటీర్లు ఒకటో తేదీనే ఇంటింటికీ వెళ్లి మరీ అందించనున్నారు.

జిల్లాలో 3 లక్షల మందికి ప్రయోజనం

జిల్లాలో అన్ని రకాల పింఛన్ల లబ్ధిదారులు 3,23,173 మంది ఉన్నారు. వీరిలో తలసేమియా, కిడ్నీ రోగులు, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్స్, కళాకారులు మినహా మిగిలిన పింఛన్‌దారులు ఈ పెంపు ప్రయోజనం పొందనున్నారు. సెప్టెంబర్ నెలలో కొత్తగా 7 వేల మందికి పింఛన్ మంజూరు చేశారు. వీరితో పాటు పాతవారందరికీ పెంచిన మొత్త అందుతుంది. ఈ మేరకు ప్రభుత్వంపై నెల వారీ రూ.7.50 కోట్లు అదనపు భారం పడుతుంది. టీడీపీ ప్రభుత్వ కాలంలో నెలకు రూ.వెయ్యి అందేది. దీన్ని పొందడానికి వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు నానా అవస్థలు పడేవారు. ఎన్నికల ముందు వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో చూసి టీడీపీ రూ. 2 వేలు చేసింది. ఆ తర్వాత అధికారం చేపట్టిన వైఎస్ జగన్ ఇచ్చిన మాట ప్రకారం ఏటా పెంచుకుంటూ వస్తున్నారు. ప్రస్తుతం వికలాంగులు, ట్రాన్స్ జెండర్స్, కళాకారులకు రూ. 3 వేలు చొప్పున పింఛన్ మొత్తం అందుతుంది.



ఉర్లాంలో వితంతు పింఛన్‌ను అందిస్తున్న వలంటీర్(ఫైల్)

ప్రస్తుతం రూ. 2750 పింఛను పొందుతున్న వారి వివరాలు

వృద్ధాప్య పింఛన్లు	వితంతు	చేనేత	కల్లు గీత కార్మికులు
1,76,205	73,238	3600	1917

ఒంటరి మహిళ	డప్పుకళాకారులు	చెప్పులు కుట్టే కార్మికులు	మత్స్యకార
10,144	1986	564	7562

ఆనందంగా ఉంది



జనవరి నుంచి రూ. 3000 పింఛన్ ఇస్తారని తెలిసి ఆనందిస్తున్నాం. జగన్ బాబు సీఎం అయినప్పటి నుంచి మా కష్టాలు తీరాయి. ఇంటికి తీసుకువచ్చి పింఛన్ ఇస్తున్నారు. ఏటా పింఛన్ పెంచుతున్నారు. ప్రస్తుతం రూ. 2750 వస్తుంది. దీన్ని జనవరి నుంచి రూ. 3 వేలు చేస్తారని చెబుతున్నారు. సంతోషంగా ఉంది.

– రెడ్డి అచ్చాయమ్మ, ఉలకాం

పింఛన్ దరఖాస్తులే లేవు



గతంలో ఏ గ్రామానికి వెళ్లి గ్రీవెన్స్ నిర్వహించినా 50 శాతానికిపైగా అర్జీలు పింఛన్లు కావాలనే వచ్చేవి. ఇప్పుడు స్పందన కార్యక్రమంలో నాలుగైదుకు మించి అలాంటివి రావడం లేదు. జిల్లావ్యాప్తంగా పారదర్శకంగా అర్హులను ఎంపిక చేస్తుండడంతో అధికారులకు ఫిర్యాదులు రావడం లేదు. కొత్త సంవత్సరం నుంచి రూ. 3 వేలు పింఛన్ అందించనున్నాం. జిల్లాలో రూ.90 కోట్ల వరకు నెలకు పింఛన్ల కోసం ప్రభుత్వం వెచ్చించనుంది.

– విద్యా సాగర్, డీఆర్‌డీఏ పీడీ

అక్రమాలు పసిగడతాం.. వారి పనిపడతాం



ఎక్సైజ్ శాఖ పరంగా ప్రభుత్వానికి ఎలాంటి చెడ్డ పేరు రాకుండా చూసుకుంటామని జిల్లా నూతన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఎచ్చెర్ల బ్యాట్లింగ్ కంపెనీ యూనిట్ (ఏపీఎస్‌బీసీఎల్) డిపో మేనేజర్ బి.సుబ్బారావు పేర్కొన్నారు. పాత తప్పులు పునరావృతం కానీయబోమని, కల్తీ మద్యం విక్రయాలు, అక్రమ రవాణాను పూర్తిగా అరికడతామని చెప్పారు. ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

– శ్రీకాకుళం క్రైమ్

- జిల్లా నూతన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుబ్బారావు
- 'సాక్షి'తో మాటామంతీ

సాక్షి : మీ ఉద్యోగ నేపథ్యం..?

అధికారి : మాది గుంటూరు జిల్లా నర్సారావుపేట. బీటెక్ కంప్యూటర్ సైన్స్ చదివాను. 2012 గ్రూప్–1 బ్యాచ్. విజయవాడ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా మొదట పోస్టింగ్ రాగా.. 2018లో విశాఖపట్నం ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ఉద్యోగోన్నతి లభించింది. ఈ ఏడాది నవంబరు ఆఖరు(28న)లో పల్నాడు జిల్లా ఈఎస్‌గా ఉన్న నేను బదిలీపై శ్రీకాకుళం వచ్చాను.

సాక్షి : నవంబరు 24న సస్పెన్షన్‌కు గురైన వై.ఆదినారాయణమూర్తి స్థానంలో మీరు వచ్చారు. దాని పర్యవసానం మీ విభాగంపై ఏమైనా పడిందా?

అధికారి : చాలా పడింది. ఆ అంశం జరిగిన తర్వాత అడ్మినిస్ట్రేషన్ పరంగా ఒక్కో సమస్య బయట పడుతోంది. ఈ అంశాన్ని క్లియర్ చేయడానికి నాపై నమ్మకంతో ప్రభుత్వం ఈ జిల్లాకు నన్ను నియమించింది. శాఖ పరంగా ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా ఇకపై చూసుకుంటాం.

సాక్షి : జిల్లాలో బార్లు, మద్యం దుకాణాలకు సమయపాలన ఉందా..?

అధికారి : మద్యం షాపులైతే ఉదయం పది గంటల నుంచి రాత్రి తొమ్మిది వరకు (అదనంగా మరో గంట అకౌంటింగ్ చేయడానికి మాత్రమే), బార్లు ఉదయం పది గంటల నుంచి రాత్రి 11.30 గంటల వరకు పర్మిషన్ ఉంది. కచ్చితంగా ఇదే సమయపాలన పాటించాలి.

సాక్షి : మీ విభాగానికి సంబంధించి పర్యవేక్షణ ఎలా ఉంటుంది..?

అధికారి : పర్యవేక్షణలో మా కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుళ్లు వీఓలుగా ఉండి కీలకంగా వ్యవహరిస్తారు. వారి పరిధి బట్టి ఆరు నుంచి ఏడు షాపులను కోడ్ నంబర్ ఉన్నవి విధుల్లో అప్పగిస్తాం. దుకాణాల్లో ఎంఆర్పీ కంటే అధికంగా అమ్ముతున్నారా, మద్యాన్ని కల్తీ చేస్తున్నారా, ఎన్‌డీపీఎల్ (అక్రమ మద్యం) బాటిళ్లు అమ్ముతున్నారా వంటివి వీరు పసిగడతారు. ఏ రోజుకారోజు డెలివరీ చేయాల్సిన స్టాక్ ఎంత, మిగిలినది ఎంత, ఎంత విక్రయించారు వంటి లావాదేవీలు చివరి గంటలో సూపర్‌వైజర్ వద్ద తీసుకుని ఎస్ఐలకు చెప్పాలి. వారి ద్వారా సీఐలకు, తద్వారా నాకు సమాచారం వస్తుంది.

సాక్షి : ఎవరైనా తప్పు చేస్తే ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

అధికారి: శాఖాపరంగా ఉన్న సిబ్బంది గానీ, ప్రభుత్వ దుకాణాల్లో పనిచేసే సేల్స్‌మెన్, సూపర్‌వైజర్లు గానీ తప్పుచేస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవు. ఈ మధ్య కాలంలో కోటబొమ్మాళి(కోడ్ నంబర్ 1991), పిన్నింటిపేటల్లో మద్యాన్ని కల్తీ చేసి అమ్ముతున్నారన్న సమాచారంతో రెండు దుకాణాలపై దాడులు నిర్వహించి ఐదుగురిని రిమాండ్‌కు తరలించాం. ఒక సూపర్‌వైజర్ పరారీలో ఉన్నారు. విధులు సక్రమంగా నిర్వహించని కానిస్టేబుల్ (వీఓ)పై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నాం.

సాక్షి : మద్యం షాపుల్లో నాసిరకం మద్యం విక్రయిస్తున్నారని, డిజిటల్ పేమెంట్ లేదని విమర్శలు వస్తున్నాయి. వాస్తవమెంత..?

అధికారి : ఇవన్నీ అవాస్తవాలు. చాలావరకు ప్రజలు మద్యం దుకాణాల వద్ద డిజిటల్ పేమెంట్ చేస్తున్నారు. ప్రభుత్వం కూడా దీన్ని ప్రోత్సహిస్తోంది. నాసిరకం మందు అన్నది ప్రజల్లో అపోహ మాత్రమే. పాపులర్ బ్రాండ్‌ల మద్యం కూడా జిల్లాలో స్టాకు ఉంది.

సాక్షి : జిల్లాలో బెల్టు షాపుల నిర్వహణ ఇంకా కొనసాగుతోందా..?

అధికారి : ప్రభుత్వ మార్గదర్శకాలతో సెబ్, ఎక్సైజ్, లాఅండ్ ఆర్డర్ పోలీసులు సమన్వయంతో బెల్టు షాపులపై పూర్తి దృష్టి పెట్టడంతో వీటి నిర్వహణ చాలా వరకు తగ్గింది. ఎక్కడో అరకొర ఉన్నా దాడులు చేస్తూ పట్టుకుంటున్నారు. ఇదే పద్ధతిలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే అక్రమ మద్యంపైనా నిఘా పెట్టాం.

న్యూస్‌రీల్

వాసుదేవుని సన్నిధిలో ధనుర్మాస పూజలు



సర్వ అలంకృతుడైన వాసుదేవ పెరుమాళ్

మందస: మందసలోని శ్రీవాసుదేవ పెరుమాళ్ ఆలయంలో ఆదివారం వేకువజాము నుంచి ధనుర్మాస పూజలు ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు ఆధ్వర్యంలో ప్రతి రోజూ ఉదయం 5 గంటల నుంచి 6.30 వరకు తిరుప్పావై సేవా కాలం జరుగుతుందని శ్రీవాసుదేవ సేవాసమితి ప్రతినిధులు చెప్పారు. జనవరిలో జరిగే భోగి పండగ వరకు ఆండాళ్‌శ్రీవ్రతం జరుగుతుందని, భక్తులు పాల్గొనాలని వారు కోరారు. ధనుర్మాసం ప్రారంభం సందర్భంగా స్వామివారిని సర్వ అలంకృతుని చేశారు.

కవితలకు ఆహ్వానం

శ్రీకాకుళం కల్చరల్: పరవస్తు చిన్నయసూరి 217వ జయంత్యుత్సవం సందర్భంగా చిన్నయసూరి సాహితీ పీఠం, ఉత్తరాంధ్ర అధ్యక్షుడు తాళ్లూరి విజయ్‌లక్ష్మణ్ కవుల నుంచి కవితలను ఆహ్వానిస్తున్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజు, ఈ–మేమనలు ఒక ప్రకటనలో తెలిపారు. కవితలు చిన్నయసూరి జీవిత విశేషాలపై ఉండాలని, ఆ కవితలు తాళ్లూరి విజయ్ లక్ష్మణ్ సెల్ నంబరు 9052344684 కు ఈనెల 19లోగా పంపాలని, 20వ తేదీన సాయంత్రం 5 గంటలకు జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆడిటోరియంలో కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

అక్కుపల్లి అంగన్‌వాడీ గుట్టురట్టు



అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని పట్టుకున్న గ్రామ సచివాలయ సిబ్బంది

వజ్రపుకొత్తూరు రూరల్: అంగన్‌వాడీల్లో పక్కదారి పడుతున్న సరుకులను సచివాలయ సిబ్బంది పట్టుకున్నారు. వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో వంద కిలోల బియ్యం అక్రమంగా తరలిస్తుంటే సచివాలయ సిబ్బంది అడ్డుకున్నారు. ఇక్కడ బియ్యం, పాలు, గుడ్లు పక్కదారి పడుతున్నాయని స్థానికులు కూడా చాలా సార్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శనివారం రాత్రి సచివాలయ సిబ్బంది పక్కదారి పడుతున్న బియ్యాన్ని పట్టుకోవడంతో నిజం బయటపడింది. ఈ బియ్యాన్ని గరుడభద్రకు చెందిన వ్యాపారికి విక్రయించేందుకు చూశారని సచివాలయ సిబ్బంది తెలిపారు. బియ్యాన్ని సచివాలయానికి తరలించారు.

ఆదిత్యునికి ప్రత్యేక పూజలు



దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

అరసవల్లి: మార్గశిర మాసం ఆదివారం సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుని ఆదిత్యుడిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అంతరాలయం ముందు వరుసలో ప్రతి భక్తునికి సజావుగా దర్శనాన్ని కలిగేలా ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకబృందం చర్యలు చేపట్టారు. ఇక ఒక్కరోజులో దర్శన టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,04,400, విరాళాలు, పూజల ద్వారా రూ.78,651, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1.95 లక్షల వరకు ఆదాయం లభించినట్లు ఈఓ తెలిపారు.

'గణితంలో రాణిస్తే జీవితంలో ఉన్నత స్థానం'



జిల్లాస్థాయిలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులతో పగడాలమ్మ, సిక్కోలు గణిత వేదిక ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: గణితం మానవుల దైనందిన జీవితంతో ముడిపడి ఉందని ఉప విద్యాశాఖాధికారి(టెక్కలి) గార పగడాలమ్మ అన్నారు. ఈ నెల 22న జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని సిక్కోలు గణిత ఉపాధ్యాయ వేదిక ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సెమినార్ హాల్‌లో ఆదివారం జిల్లాస్థాయి వేడుకల కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన గణిత పోటీ పరీక్షల్లో విజేతలగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పగడాలమ్మ మాట్లాడుతూ గణితంలో ఎవరు రాణిస్తారో వారు జీవితంలో ఉన్నత స్థాయిలో నిలుస్తారని అన్నారు. భారతీయులు ఎక్కువగా గణితంపై పట్టు సాధించడం వలనే ప్రపంచంలో ఉన్నతస్థాయిలో రాణించగలుగుతున్నారని శ్రీకాకుళం మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అభిప్రాయపడ్డారు. సిక్కోలు గణిత ఉపాధ్యాయ సంఘం చేస్తున్న కృషిని వక్తలు కొనియాడారు.

ఆకట్టుకున్న గణిత అష్టావధానం..

అంతకుముందు గణిత శాస్త్రవేత్త శ్రీనివాస్ రామానుజన్, సిక్కోలు మాథ్స్ లెజెండ్ ఓవీశాస్త్రి చిత్రపటాలకు అతిధులు, అధికారులు ఘనంగా నివాళులర్పించారు. అమలాపురానికి చెందిన గణితావధాని టీఎస్‌వీఎస్ సూర్యనారాయణమూర్తి గణిత అష్టావధానం అద్భుతంగా సాగింది. కార్యక్రమంలో శ్రీకాకుళం డీవైఈవో ఆర్.విజయకుమారి, డీసీఈబీ సెక్రటరీ జి.రాజేంద్రప్రసాద్, సిక్కోలు గణిత ఉపాధ్యాయ వేదిక గౌరవాధ్యక్షులు కేవీఎస్‌ప్రసాద్, జిల్లా సైన్స్ అధికారి ఎన్.కుమారస్వామి, అసిస్టెంట్ కమిషనర్ ఎగ్జామినేషన్స్ లియాఖత్ ఆలీఖాన్, ఏపీఎంఎఫ్ రాష్ట్ర కార్యదర్శి భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలి'



యూటీఎఫ్ ప్రతినిధులతోపాటు మోడల్ పేపర్స్‌ను ఆవిష్కరిస్తున్న విజయకుమారి

శ్రీకాకుళం న్యూకాలనీ: మార్చి 18 నుంచి జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం కావాలని శ్రీకాకుళం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి పిలుపునిచ్చారు. యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రచురణల కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన ఎస్ఎస్‌సీ 2024 మోడల్ పేపర్స్ బుక్‌లెట్స్‌ను ఆదివారం శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల వేదికగా ఆవిష్కరించారు. 7 పేపర్స్ ప్యాట్రన్, ఎగ్జామ్స్ ఓరియెంటెడ్‌గా మోడల్ పేపర్స్‌ను రూపొందించినట్టు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్‌కుమార్ పేర్కొన్నారు. ప్రతి సబ్జెక్టుకు 4 మోడల్ పేపర్స్‌తోపాటు వాటి జవాబులను కూడా అందులో పొందిపర్చినట్టు వివరించారు. టెస్ట్ పరీక్షలకు హాజరయ్యే అన్ని స్థాయిల విద్యార్థులకు కూడా ఉపయుక్తమయ్యేలా రూపొందించినట్లు వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర, జిల్లా కార్యదర్శులు హెచ్ అన్నాజీరావు, జి.సురేష్, పి.సూర్యప్రకాష్, రాష్ట్ర కౌన్సిలర్సు యం.వాగ్దేవి, పి.అప్పారావు, జిల్లా నాయకులు కె.వెంకట్రావు, జి.జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కాలేజీ విద్యార్థులు అదరహో



ఎం.చంద్రశేఖర్ ఎన్‌కే అశోక్‌తేజ టి.రాజశేఖర్

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల విద్యార్థులు అదరగొట్టారు. 'ప్రజ్ఞ' యాన్యువల్ ఫెస్ట్ 2022–23లో మూడు విభాగాల్లో బహుమతులు సాధించారు. విద్యార్థులు సాధించిన విజయాలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఏటా ఈ వేడుకను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గత విద్యా సంవత్సరంలో ప్రతిభ చూపిన వారిని ప్రోత్సహిస్తారు. తాజాగా అనంతపురంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీలో ఈనెల 16న ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో నాన్ అటానమస్ క్యాటగిరిలో బయాలజీ స్ట్రీమ్‌లో అత్యధిక మార్కులు సాధించిన ఎన్‌కే అశోక్‌తేజ, నేషనల్ క్యాడెట్ కార్ప్స్‌లో స్టేట్ లెవెల్ బెస్ట్ ఎన్‌సీసీ క్యాడెట్‌గా ఎం.చంద్రశేఖర్, ఏపీ పీజీ సెట్‌లో ఫస్ట్ ర్యాంకర్‌గా టి.రాజశేఖర్ ఇక్కడ బహుమతులు అందుకున్నారు. వీరు ముగ్గురూ ఆర్ట్స్ కాలేజీ విద్యార్థులే. రాజశేఖర బదులు కాలేజీ ప్రిన్సిపాల్ సురేఖ బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

కళాకారులకు సముచిత సత్కారం



సన్మాన గ్రహీతలతో మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం కల్చరల్: మేధావులు కళింగాంధ్ర అభివృద్ధికి మంచి సూచనలు చేశారని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో శ్రీకాకుళ సాహితీ, ధర్మాన చారిటబుల్ ట్రస్టు, కళింగాంధ్ర సాంస్కృతిక వేదికల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కళింగాంధ్ర సాహిత్య సమాలోచన, వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కార గ్రహీతల సత్కార సభల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వమైనా రాజ్యాంగానికి అనుబంధంగా పరిపాలన చేయడం జరుగుతుందన్నారు. తమ ప్రభుత్వ పథకాలన్నీ అందరికీ పక్షపాతం లేకుండా అందించామన్నారు. విద్యారంగంలో ఎన్నో మార్పులు తీసుకువచ్చామని తెలిపారు. వైద్యరంగంలో కూడా సంస్కరణలు తీసుకువచ్చామన్నారు. ఇలాంటి అభివృద్ధిని మేధావులు అర్థం చేసుకునేందుకు ఈ వేదిక ఉపయోగపడిందని తెలిపారు. అనంతరం అయ్యగారి సీతారత్నం రచించిన 'స్కాలర్' నవల, నిక్కు అప్పన్న రచించిన గేయ సుధాబిందువులు, సుంకిరెడ్డి నారాయణరెడ్డి రచించిన 'గురజాడ–మరికొన్ని వ్యాసాలు' పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. అనంతరం వైఎస్సార్ జీవన సాఫల్యపురస్కార గ్రహీతలు, పద్యనాటక కర్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎడ్ల గోపాలరావు, సాహిత్యంలో అట్టాడ అప్పలనాయుడు, జానపద కళాకారుడు కోన సన్యాసిలను ఆయన సత్కరించారు.

కార్యక్రమంలో ప్రముఖ రచయిత దీర్ఘాసి విజయ భాస్కర్, నల్లి ధర్మారావు, ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు, డాక్టర్ జి.లక్ష్మీనరసయ్య, కంచరాన భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.





నిప్పులపై నడక

పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 18వ వార్డు రోటరీనగర్‌లో ఆదివారం అగ్ని గుండం ఏర్పాటు చేశారు. ఒంటికి శూలాలు గుచ్చుకున్న మాలధారులు ఎర్రటి అగ్గి నిప్పులపై తొమ్మిది సార్లు నడిచారు. గురుస్వామి రాజు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. – కాశీబుగ్గ

క్లుప్తంగా

డయల్ యువర్ డీఎంకు 14 వినతులు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో ఆదివారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి 14 వినతులు అందినట్లు శ్రీకాకుళం డిపో–1 మేనేజర్ మల్లికార్జునరావు పేర్కొన్నారు. శ్రీకాకుళం పాత బస్టాండ్–రామలక్ష్మణ కూడలి మీదుగా సర్వీసులు పెంచాలని, గార వైపు రాత్రి 8.30కు బస్సు వేయాలని, జయపూర్, గుణుపూర్ వెళ్లేందుకు ఉదయం 6.45కు ఇదివరకు ఉన్న సర్వీసు పునరుద్ధరించాలని. శ్రీకాకుళం నుంచి మందస వెళ్లేందుకు ఇది వరకు ఉన్న 7 గంటల సర్వీసు మళ్లీ కొనసాగించాలని, శ్రీకాకుళం నుంచి కాకినాడకు రాత్రి 8.30 సర్వీసు అందు బాటులో ఉంచాలని కొందరు కోరారు. ఫిర్యాదులపై స్పందించిన డీఎం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు డొంకలపర్త విద్యార్థి


స్వామినాయుడు

సరుబుజ్జిలి: బూర్జ మండలంలోని డొంకలపర్త గ్రామానికి చెందిన విద్యార్థి బలగ స్వామినాయుడు జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు అర్హత సాధించాడు. ఆదివారం విజయనగరంలో జరిగిన వింటర్ ఆక్వాటిక్ జూనియర్, సబ్‌జూనియర్ రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. వివిధ విభాగాల్లో గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించాడు. త్వరలో బెంగళూరులో జరిగే జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు అర్హత సాధించడంపై పలువురు అభినందనలు తెలిపారు.

అగ్ని ప్రమాదంలో వృద్ధురాలు మృతి

టెక్కలి రూరల్: సంతబొమ్మాళి మండలం మేఘవరం గ్రామానికి చెందిన మోడి సరోజినమ్మ (70) ఆదివారం వేకువజామున అగ్ని ప్రమాదానికి గురై మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. సరోజినమ్మ తన గ్రామంలో ఒంటరిగా జీవిస్తుండేవారు. ప్రతి రోజూ అర్ధరాత్రి దాటాక ఇంటిలో పొయ్యి వెలిగించి వంట చేయడం ఆమెకు అలవాటని స్థానికులు తెలిపారు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత తన ఇంటిలో వంట చేస్తూ ఉండగా ప్రమాదవశాత్తూ చీరకు నిప్పు అంటుకుని కాలిపోయారు. తీవ్ర గాయాలపాలైన ఆమెను స్థానికులు టెక్కలి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె శరీరం 90 శాతం కాలిపోయింది. దీంతో పరిస్థితి విషమించి ఆమె మృతి చెందారు. ఘటనపై సంతబొమ్మాళి పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

శ్రీకూర్మనాథుని సన్నిధిలో జీఎస్టీ కమిషనర్


శ్రీకూర్మనాథాలయంలో జీఎస్టీ కమిషనర్ సంజమ్ పంత్

గార: ప్రసిద్ధ విష్ణుక్షేత్రం శ్రీకూర్మం ఆలయాన్ని ఆంధ్రప్రదేశ్ జీఎస్టీ చీఫ్ కమిషనర్ సంజమ్ పంత్ సతీసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ముందుగా మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీకూర్మనాయకిని, వైష్ణవీదుర్గ, తాబేళ్లపార్కును సందర్శించారు. ఆలయ అర్చకులు చామర్తి మురళీ కృష్ణమాచార్యులు క్షేత్ర మహాత్యాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో ఈఓ జి.గురునాథం తదితరులు పాల్గొన్నారు.

‘అంగన్‌వాడీల వ్యాఖ్యలను ఖండిస్తున్నాం’


కూన వెంకట సత్యనారాయణ

ఆమదాలవలస రూరల్: సచివాలయ సిబ్బందిపై అంగన్‌వాడీ సిబ్బంది చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని గ్రామ,వార్డు సచివాలయాల ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూన వెంకటసత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉన్నత చదువులు చదువుకుని బాధ్యత గల ప్రభుత్వ ఉద్యోగులుగా తాము విధులు నిర్వహిస్తుంటే, అంగన్‌వాడీలు వారి సమస్యలు సాధించే క్రమంలో సచివాలయ ఉద్యోగులని కించపరిచేలా మాట్లాడటం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. వ్యవస్థని, ఉద్యోగులను కించపరిచేలా అంగన్‌వాడీలు వ్యవహరించడం సబబు కాదని పేర్కొన్నారు. భేషరతుగా క్షమాపణలు చెప్పి మీ పోరాటం మీరు చేసుకోవాలని సూచించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

టెక్కలి: టెక్కలి తెంబూరు రోడ్ జంక్షన్‌లో ఆదివారం ఓ పెద్ద ప్రమాదం త్రుటిలో తప్పింది. బొరిగిపేట సమీపంలో గల క్వారీల నుంచి మూలపేట పోర్టుకు రాళ్లు తీసుకువెళ్తున్న లారీకి చెందిన చక్రం ఒక్కసారిగా అదుపు తప్పి విడిపోయింది. ఆ చక్రం నేరుగా వచ్చి ఎదురుగా పార్కింగ్ చేసి ఉన్న కారును బలంగా ఢీ కొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా నుజ్జయింది. కారులో ఎవరూ లేకపోవడంతో ప్రాణహాని జరగలేదు.

ఒకే ప్రశ్న పత్రంతో..

- నేటి నుంచి ఇంటర్ విద్యార్థులకు అర్ధసంవత్సర పరీక్షలు
- సరికొత్త పంథాలో జరగనున్న పరీక్షలు
- జిల్లా వ్యాప్తంగా ఒకే ప్రశ్నపత్రం


పరీక్షలు రాస్తున్న ఇంటర్ విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం సరికొత్త విధానంలో అర్ధవార్షిక పరీక్షలు నిర్వహించనుంది. ప్రభుత్వ, ప్రైవేటు అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలల్లో జిల్లా వ్యాప్తంగా ఒకే ప్రశ్న పత్రంతో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనుంది. సోమవారం నుంచి ఈ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షకు ముందు ప్రశ్న పత్రం కాలేజ్ ప్రిన్సిపాల్‌కు చేరుతుంది. ఐడీ, పాస్‌వార్డు ద్వారా క్వశ్చన్‌పేపర్ డౌన్‌లోడ్ చేసుకుని ప్రింటౌట్స్ తీసి, కళాశాలల్లో నిర్దిష్టమైన సమయానికి విద్యార్థులకు అందజేసి పరీక్షలు నిర్వహిస్తారు.

పకడ్బందీగా నిర్వహించాలి



ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఈ రోజు నుంచి అర్ధసంవత్సర పరీక్షలు ప్రారంభమవుతాయి. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఆర్‌ఐఓతో కలిసి ప్రిన్సిపాళ్లకు దిశానిర్దేశం చేశాం. అన్ని కాలేజీల్లో ఒకే ప్రశ్న పత్రంతో విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉంటుంది. నిష్ణాతులైన లెక్చరర్లతో ప్రశ్న పత్రాలను తయారు చేపించాం. ప్రశ్నాపత్రాన్ని పరీక్షకు ముందు ప్రిన్సిపాళ్లకు చేరవేస్తాం. పారదర్శకంగా పరీక్షలను నిర్వహించాలి.

– కోట ప్రకాశరావు, జిల్లా డీవీఈఓ, ఇంటర్మీడియెట్ విద్య

ప్రత్యేకంగా పరీక్ష పత్రం తయారీ

నిర్దిష్టమైన షెడ్యూల్ ప్రకారం పరీక్షలను నిర్వహించేలా ఇంటర్ విద్య అధికారులు చర్యలు చేపట్టారు. డీవీఈఓ కోట ప్రకాశరావు, ఆర్‌ఐఓ పి.దుర్గారావులు ప్రిన్సిపాళ్లతో పలుమార్లు ఏర్పాట్లపై సమీక్షించారు. ఇప్పటి వరకు పూర్తయిన నిర్దేశిత సిలబస్ ప్రకారం ఈ ప్రశ్న పత్రాన్ని ఇంటర్ విద్య అధికారుల పర్యవేక్షణలో నిష్ణాతులైన లెక్చరర్లు పారదర్శకంగా, అత్యంత గోప్యంగా తయారుచేస్తున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు అర్ధ సంవత్సర పరీక్షలను నిర్వహిస్తున్నారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో అధికారులు ఆకస్మిక తనిఖీలను కూడా చేపట్టనున్నారు.

168 కాలేజీల్లో

జిల్లాలో అన్ని యాజమాన్యాల పరిధిలో జూనియర్ కళాశాలలు 191 ఉన్నాయి. అయితే వీటిలో ఫంక్షనింగ్ జరుగుతున్న కళాశాలలు 168 ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 38, సోషల్ వెల్ఫేర్ 9, ట్రైబల్ వెల్ఫేర్ 1, మోడల్ స్కూల్/కళాశాలలు 13, కేజీబీవీలు 25, జెడ్పీహెచ్‌స్కూల్ కాలేజీలు 5, కో ఆపరేటివ్ 2, ప్రైవేటు కళాశాలలు 75 ఉన్నాయి. వీటిల్లో 49,690 మంది ఇంటర్మీడియెట్ చదువుతున్నారు. వీరంతా అర్ధసంవత్సర పరీక్షలను రాయనున్నారు.

పరీక్షల షెడ్యూల్ ఇది..

- ఈనెల 18వ తేదీన తెలుగు/సంస్కృతం/హిందీ
- 19న ఇంగ్లిష్
- 20న మాథ్స్–ఎ/బోటనీ/సివిక్స్
- 21న మాథ్స్–బి/జువాలజీ/హిస్టరీ
- 22న ఫిజిక్స్/ఎకనామిక్స్
- 23న కెమిస్ట్రీ/మాథ్స్/సోషియాలజీ

విశ్రాంత ఉద్యోగులే దిశా నిర్దేశకులు

- రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు


పెన్షనర్స్ డే కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): విశ్రాంత ఉద్యోగులు నేటి సమాజానికి దిశా నిర్దేశం చేయగలరని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని కళింగకోమటి సంక్షేమ భవనంలో జాతీయ పెన్షనర్స్ డేని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు, విధుల్లో ఉన్న ఉద్యోగులు ప్రభుత్వంలో ఒక భాగమేనన్నారు. ఉద్యోగులు ప్రజలకు, ప్రభుత్వానికి వారధులు వంటి వారని తెలిపారు. విశ్రాంత ఉద్యోగులు ఆరోగ్యాల్ని కాపాడుకుంటూ వారి కుటుంబాన్ని ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. సమావేశంలో ట్రెజరీ డీడీ రవికుమార్, రిటైర్డ్ తహసీల్దార్లు డి.పి దేవ్, పోలీస్ సంఘం అధ్యక్షులు రామారావు, పెన్షనర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు ఊడి శ్యామ్, తవిటినాయుడు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విప్లవ గీతాలతో హోరెత్తిన సూదికొండ కాలనీ

పలాస:

పలాస సూదికొండ కాలనీలోని వీధులను అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, ప్రజాకళామండలి కళాకారులు విప్లవ గీతాలతో ఆదివారం హోరెత్తించారు. పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం వద్ద ఈ నెల 22న విప్లవ కవి సుబ్బారావు పాణిగ్రాహి 54వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ మేరకు ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, ప్రజాకళామండలి రాష్ట్ర సహాయక కార్యదర్శి కొర్రాయి నీలకంఠం, అరుణోదయ రాష్ట్ర కార్యదర్శి నిర్మల, రైతుకూలీ సంఘం రాష్ట్ర నాయకులు తాండ్ర ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


సూదికొండ కాలనీలో కళాకారుల ప్రచారం

అతివేగం ఆయువు తీసింది


మృతి చెందిన బలగ రాంబాబు (ఫైల్)

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని ఉమెన్స్ కాలేజీ రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలకొండ మండలం కొండాపురం గ్రామానికి చెందిన బలగ రాంబాబు(22) దుర్మరణం పాలయ్యాడు. ట్రాఫిక్ ఎస్‌ఐ రామారావు తెలిపిన వివరాల మేరకు.. రాంబాబు స్థానిక ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసి ఇక్కడే హాస్టల్‌లో స్నేహితులతో ఉంటూ కలిసి పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్నాడు. ఈ నేపథ్యంలో పాలకొండ మండలం బుక్కూరు గ్రామానికి చెందిన తన స్నేహితుడు అంపిలి చంద్రశేఖర్ చర్చికి పిలవడంతో అతనితో పాటు వుమెన్స్ కాలేజీ రోడ్డులో ఉన్న చర్చికి వెళ్లాడు. ప్రార్థన ముగిసిన అనంతరం రాంబాబు స్నేహితుడి బైక్ తీసుకుని 80 ఫీట్ రోడ్డు వరకు షికారుకు వెళ్దామని బయల్దేరాడు. చంద్రశేఖర్ డ్రైవింగ్ చేయగా రాంబాబు వెనుక కూర్చున్నాడు. కొద్ది దూరం వెళ్లే సరికి సడెన్ బ్రేక్ వేయడంతో వెనుక కూర్చున్న రాంబాబు తుళ్లి రోడ్డుపై పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయమై చెవి, నోటి నుంచి రక్తస్రావమైంది. చంద్రశేఖర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సాయంతో రాంబాబును రిమ్స్‌కు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. యువకుడి తల్లిదండ్రులు బలగ అప్పారావు, రామలక్ష్మి నిరుపేద కుటుంబానికి చెందిన వారు. వీరు హైదరాబాద్‌లో వలస కూలీలుగా పని చేస్తున్నారు. కుమారుడి మృతి వార్త తెలిసిన వెంటనే వారు ఇక్కడకు బయల్దేరారు. మృతుడి పెద్దనాన్న బలగ సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రామారావు చెప్పారు.

పోలెండ్‌లో ధర్మపురం వాసి మృతి


సోమేశ్ (ఫైల్)

ఇచ్ఛాపురం రూరల్: పొట్టకూటి కోసం విదేశాలకు వెళ్లిన ఓ యువకుడు అక్కడే అసువులు బాసాడు. ఇచ్ఛాపురం మండలం ధర్మపురం గ్రామానికి చెందిన ఉప్పాడ సోమేశ్(36) చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. వెల్డింగ్‌లో శిక్షణ పొందిన సోమేశ్ కరోనాకు ముందు వివాహం చేసుకొని స్థానికంగా కూలి పనులు చేసుకుని జీవించేవాడు. ఈ ఏడాది అక్టోబర్ 2న పోలెండ్ వెళ్లిన సోమేశ్ గత వారం రోజుల నుంచి అనారోగ్యంతో పోలెండ్ ఆస్పత్రిలో చేరాడు. తనకు ఆరోగ్యం సరిగా లేదని, ఇక్కడ ఎవరూ చూసుకోవడానికి లేరని బాధ పడుతూ ఇటీవల వీడియో ద్వారా స్నేహితులకు, భార్యకు సందేశం పంపించాడు. శనివారం రాత్రి సోమేశ్ చనిపోయినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. దీంతో వారు కన్నీరుమున్నీరయ్యారు. మృతునికి భార్య పుష్పతో పాటు ఎనిమిది నెలల పాప కావ్యశ్రీ ఉంది. తన భర్త మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించాలంటూ భార్య పుష్ప ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

చికిత్స పొందుతూ హెడ్ కానిస్టేబుల్ భార్య మృతి

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని అరసవల్లి మిల్లు జంక్షన్ సమీపంలో గత గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందిందని ట్రాఫిక్ ఎస్‌ఐ ఎస్ఎస్ దొర పేర్కొన్నారు. రాజమండ్రి సిటీ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మృత్యుంజయ వర్మ తన భార్య సుజాతతో కలిసి భోగాపురం మండలానికి బంధువుల కార్యానికి వచ్చి, అక్కడి నుంచి అరసవిల్లి సూర్యనారాయణస్వామిని దర్శించుకోవడానికి వచ్చిన సంగతి తెలిసిందే. అరసవల్లి మిల్లు కూడలి సమీపంలో బండి చక్రానికి చీర చుట్టుకోవడంతో రోడ్డుపై పడిపోయిన సుజాత తలకు గాయం తగలడంతో గత కొద్దిరోజులుగా కిమ్స్‌లో చికిత్స పొందిన ఈమె ఆదివారం రిమ్స్‌లో చేరిన కొన్ని గంటల్లోనే మృతి చెందిందని ఎస్‌ఐ పేర్కొన్నారు.

కష్టం అగ్గిపాలు

జలుమూరు: మండలంలోని జమ్మినివలసలో ఆదివారం రాజు అనే రైతుకు చెందిన వరికుప్పలు అగ్నికి ఆహుతయ్యాయి. విషయం తెలుసుకుని రైతులు సంఘటనా స్థలానికి వెళ్లి చూసేటప్పటికి రెండున్నర ఎకరాలకు సంబంధించిన వరి కుప్ప పూర్తిగా కాలి బూడిదైంది. ఇదే గ్రామానికి చెందిన ఓ రైతు తన పంట పొలంలో మంట పెట్టడం వల్ల ఆ మంటలు చెలరేగి గడ్డికుప్పలు దగ్ధమయ్యాయని స్థానికులు చెబుతున్నారు.

ఆక్వా హబ్ ప్రాజెక్టు పనుల పరిశీలన


హిరమండలం ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

హిరమండలం: హిరమండలంలో నిర్మిస్తున్న ఆక్వా ప్రాజెక్టు నిర్మాణ పనులను ఫిషరీష్ సర్వే ఆఫ్ ఇండియా సైంటిస్టు జీవీఏ ప్రసాద్ ఆదివారం పరిశీలించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం కోటి రూపాయలతో ఆక్వా హబ్ ప్రాజెక్టు నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. స్థానిక రాజ్యలక్ష్మి ఫార్మర్స్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్ ద్వారా 40 శాతం సబ్సిడీతో పనులు జరుగుతున్నాయి. ప్రాసెసింగ్ ప్లాంట్, శీతలీకరణ గదులు, ఐస్‌ప్లాంట్, కోల్డ్‌స్టోరేజ్ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విలువైన సలహాలు సూచనలు అందించారు. నాణ్యమైన ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆక్వా హబ్ ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఆయన వెంట పాలకొండ డివిజన్ మత్స్యశాఖ అధికారి డబ్బీరు గోపీకృష్ణ, ఎఫ్‌పీఓ హబ్ ఆపరేటర్ మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధనుంజయరెడ్డికి తెలంగాణలో నంది అవార్డు


సినీనటులు సమీర్, శివారెడ్డి చేతులమీదుగా నంది అవార్డు స్వీకరిస్తున్న జానపద కళాకారుడు ధనుంజయరెడ్డి

ఇచ్ఛాపురం రూరల్: జిల్లాలోని జానపద కళల్లో విశిష్ట సేవలు అందిస్తున్న తిప్పన ధనుంజయరెడ్డి తెలంగాణలో నంది అవార్డును అందుకున్నారు. తెలంగాణకు చెందిన కల్చరల్ మెగా ఎంటర్‌ప్రైజెస్ సంస్థ ఆదివారం హైదరాబాద్ బిర్లా ఆడిటోరియంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సినీనటులు సుమన్, సమీర్, శివారెడ్డి చేతులమీదుగా ఆయన నంది అవార్డును అందుకున్నారు. తిప్పన ధనుంజయరెడ్డి జానపదంలో కోలాటం, పండరి భజన కళలకు అందిస్తున్న సేవలకు గాను ఈ అవార్డును అందజేశారు. ఆయనను జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజు, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీపీ బోర పుష్ప, జెట్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, సర్పంచ్ కారంగి త్రినాథ్‌రెడ్డి, ఉద్దానం కళాకారులు అభినందనలు తెలిపారు.

రంగస్థల కళాకారుల నూతన కార్యవర్గ ఎన్నిక

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది. జిల్లా అధ్యక్షులుగా చిట్టి వేంకటరావు, ప్రధాన కార్యదర్శిగా బంటుపల్లి రామచంద్రదేవ్‌లను ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షులుగా కలగ గణేష్‌యాదవ్, నిక్కు హరిసత్యనారాయణ, పొట్నూరు వెంకటరావు, మెట్ట వెంకటరాజు, సంయుక్త కార్యదర్శులుగా బీఎన్ భూషణ్, ఎం.వాసుదేవాచారి, పైడి సత్యవతి, ఆశాలతాఖాన్, కోశాధికారిగా ఇంజరాపు రమణారావు, గౌరవ సలహాదారుగా పీఎంజెబాబు, న్యాయసలహాదారుగా కంచరాన అప్పారావు, కార్యనిర్వాహక అధ్యక్షులుగా పన్నాల నర్సింహమూర్తి, ఆర్థిక సలహాదారుగా బీఏ మోహనరావు, సభ్యులుగా ఎల్.నందికేశ్వరరావు, బీఎంఎస్ పట్నాయిక్, సాంగల గణేష్, ఎం.శాంతారామ్, అగతమూడి సింహాచలం, వంజరాపు సత్యం, కలగ ఆదికేశవరావు, వి.శారదల ఎంపికయ్యారు.

‘విద్యార్థి మృతికి స్కూల్ యాజమాన్యానిదే బాధ్యత’


భీమిలి పోలీస్‌స్టేషన్ వద్ద విద్యార్థి బంధువులు

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస నారాయణ స్కూల్‌లో 9వ తరగతి విద్యార్థి(14) ఆత్మహత్యకు పాఠశాల యాజమాన్యమే బాధ్యత వహించాలని అతని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండలం జాడుపల్లికి చెందిన విద్యార్థి తల్లిదండ్రులు హిమబిందు, గణేష్, పెద్దమ్మ దుర్గ, సర్పంచ్ కన్నబాబు తదితరులు శనివారం రాత్రి ఇక్కడకు చేరుకున్నారు. భీమిలి పోలీస్‌స్టేషన్ వద్ద ఆదివారం ఉదయం పెద్దమ్మ దుర్గ మాట్లాడుతూ ఆరు నెలలుగా స్కూల్ ఇన్‌చార్జి జగదీష్.. తమ బిడ్డను వేధిస్తున్నాడని ఆరోపించారు. అతను ఎలా చనిపోయాడో జగదీష్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తన పేరులో మొదటి అక్షరం ‘ఎస్’ను చేతిపై రాసుకుంటే.. ఒక అమ్మాయి పేరు రాసుకున్నట్లు భావించి పలుమార్లు కొట్టారని ఆరోపించారు. శనివారం మధ్యాహ్నం 2.30కు గణేష్‌కి ఫోన్ చేసినట్లు స్కూల్ యాజమాన్యం చెబుతోందని.. అయితే అతని ఫోన్ అందుబాటులో లేకపోవడంతో సాయంత్రం వరకు వివరాలు తెలియలేదన్నారు. తాము వచ్చేటప్పటికి తమ బిడ్డ మృతదేహాన్ని సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రి మార్చురీకి తరలించారన్నారు. ముమ్మాటికీ స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యం, కక్షపూరితమైన వ్యవహారం కారణంగానే తమ బిడ్డ చనిపోయాడని అతని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా.. స్కూల్‌కు చెందిన ఇద్దరు ప్రతినిధులు విద్యార్థి కుటుంబ సభ్యులతో ఉదయం నుంచి భీమిలి పోలీస్ స్టేషన్ వద్ద మంతనాలు సాగించారు. విద్యార్థి మృతదేహానికి పోస్టుమార్టం చేసి తీసుకువెళ్లాలని ప్రాధేయపడుతున్నట్టు తెలిసింది. ఆదివారం సాయంత్రం వరకు ఈ విషయం ఓ కొలిక్కి రాలేదు. భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు


మున్సిపాలిటీ పరిధి రోటరీనగర్‌లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. చినబడాం క్రిస్టియన్ ప్రేయర్ టెంపుల్ బిషప్ డి.ఎస్.వి.ఎస్.కుమార్ పాస్టర్ క్రీస్తు సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో ఇవాన్ గ్లోరి, పాస్టర్ సతీష్, పాస్టర్ రాజు పాల్గొన్నారు. – కాశీబుగ్గ

బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కార్యవర్గం


జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కార్యవర్గంతో పూర్ణచంద్ర, కృష్ణంరాజు, ఒలింపిక్ సంఘ నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం ఓ ప్రైవేట్ రిసార్ట్స్ వేదికగా జరిగాయి. ఈ ఎన్నికల్లో పలాసకు చెందిన కోత పూర్ణచంద్రరావు జిల్లా అధ్యక్షునిగా, రాజాంకు చెందిన పీవీజీ కృష్ణంరాజు(తృప్తి రిసార్ట్స్ మురళీ మాస్టారు) ప్రధాన కార్యదర్శిగా మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ గత మూడేళ్లగా జిల్లా క్రీడాకారులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న తీరును వివరిస్తూ సంతోషం వ్యక్తం చేశారు. ఎస్సై యానాళ్ల తారకేశ్వరరావు, కోచ్ మధుసూదనరావుల నేతృత్వంలో ఎచ్చెర్ల బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ సభ్యులు గేమ్ అభివృద్ధికి చేస్తున్న కృషిని నూతన కార్యవర్గ సభ్యులంతా కొనియాడారు. అసోసియేషన్ ఏకగ్రీవానికి సహకరించిన సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ ఎన్నికలకు ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు బీహెచ్ ఆదినారాయణ, డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు, ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఆర్.రమేష్ వ్యవహరించారు. ఒలింపిక్ అసోసియేషన్ ముఖ్య సలహాదారు పి.సుందరరావు, పీఈటీ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎంవీ రమణ, బాల్ బ్యాడ్మింటన్ సీనియర్ క్రీడాకారులు, పీడీలు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఇదే..

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్‌గా సూర శ్రీనివాసరావు, అధ్యక్షుడిగా కోత పూర్ణచంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా పీవీజీ కృష్ణంరాజు, ఉపాధ్యక్షులు ఎం.రామకృష్ణంనాయుడు, గొండు శంకర్, జి.శ్రీనివాస్‌నాయుడు, ఎస్.మహారాజ్ బేట, సీహెచ్ రఘురామ్, సహాయ కార్యదర్శులుగా ఎం.సత్యనారాయణ, ఎం.మధుసూధనరావు, ఎం.గోవిందనాయుడు, ఎల్.రమేస్‌బాబు, కోశాధికారిగా బీహెచ్ అరుణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా బి.శంకరరావు, కె.చక్రధరరావు, జి.ప్రమీల, చింతు గణపతి, రువ్వ రమణమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.